

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

- రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త సర్వీస్ ప్రారంభం
- ఆస్తి కొనుగోలుదారుడి ఫోన్ నంబర్‌కే డాక్యుమెంట్
- ఆ తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఒరిజినల్' అందజేత

- కథనం 8వ పేజీలో..

వైసీపీలో జడ్పీ లొల్లి

పార్టీ సభ్యుల మధ్య విభేదాలు

- ఫోరం అధ్యక్షుడి మార్పు
- దొండా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం ఎన్నిక
- ఫ్లోర్ లీడర్‌కు సమాచారం నిల్



దొండా రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు



కర్రి సత్యం, జడ్పీటీసీ సభ్యుడు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యుల మధ్య విభేదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షునిగా ఉన్న దొండా రాంబాబును తప్పించి ఆ స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకున్నారు. శనివారం జడ్పీ స్టాండింగ్ కమిటీ మీటింగ్‌కు హాజరైన సభ్యులు తరువాత విడిగా సమావేశమయ్యారు.

జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వ్యక్తిగత సహాయకుడు ప్రసాద్ (జడ్పీ ఉద్యోగి)ను తప్పించాలని కోరుతూ సంతకాలు సేకరించారు. ఫిర్యాదు కాపీపై 23 మంది సంతకాలు చేశారు. అయితే బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు, వైసీపీ జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు దొండా రాంబాబు తొలుత సంతకం చేసి, ఆ తరువాత కొట్టేశారు. అప్పటికే ఫోరం అధ్యక్షుడిగా తనను తప్పిస్తారని ఆయనకు సమాచారం ఉండడంతోనే సంతకం కొట్టేశారని చెబుతున్నారు. ఇదిలావుండగా సీసీపై ఫిర్యాదు గురించి వైసీపీ ఫ్లోర్‌లీడర్, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజుకు సమాచారం లేదని తెలిసింది. ఆయనతోపాటు మరికొందరు సభ్యులు సంతకాలు చేయలేదు. కాగా జిల్లాలో 39 జడ్పీటీసీ స్థానాల్లో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిపి వైసీపీకి 36 మంది సభ్యులు ఉన్నారు. చైర్‌పర్సన్ సుభద్రపై అసంతృప్తితో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన సర్వసభ్య సమావేశాన్ని 22 మంది సభ్యులు బహిష్కరించారు. తరువాత పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్, సభ్యుల మధ్య సయోధ్య కుదిర్చినా అది తాత్కాలికమేనని తాజా ఘటనలతో స్పష్టమైంది. ఫోరం అధ్యక్షుడిగా రాంబాబు స్థానంలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యాన్ని ఎన్నుకోవడంతో సభ్యుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి.

అందరం కలిసి మాట్లాడదామని సత్యం చెప్పినా తరువాత ఏమి జరిగిందోగానీ ఆయనే ఫోరం అధ్యక్షుడు అంటూ సభ్యులు వెల్లడించారు. జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఎనిమిది నెలల కాలానికి గౌరవ వేతనం అందగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మరో ఆరు నెలల వేతనం అందింది. సుమారు 30 నెలల కాలానికి గౌరవ వేతనం జడ్పీటీసీ సభ్యులకు రాలేదని అనేక పర్యాయాలు ఆవేదన వ్యక్తం చేసినా ఫోరం అధ్యక్షుడు పట్టించుకోలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు.

అందుకే ఫోరం అధ్యక్షుడిని మార్చుకున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయినట్టేనని ఒక సభ్యుడు వ్యాఖ్యానించారు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన సభ్యులు, (ఇన్‌సెట్‌లో) చైర్‌పర్సన్ సుభద్ర

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

అర్హులకు వెంటనే మంజూరు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రుణాలు ఇవ్వాలి
- 108 వాహనాలు పనిచేయక ఇబ్బందులు
- అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనకాలజీ సేవలు అంతంతమాత్రమే
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆందోళన

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు ఇబ్బంది పడుతున్నారని దేవరాపల్లి, గొలుగొండ జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, గిరిబాబు తెలిపారు. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ దేవరాపల్లి జడ్పీ స్కూల్‌లో హిందీ, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో అర్హులకు రుణాలు మంజూరుచేయాలన్నారు. 108 వాహనాలు సరిగ్గా పనిచేయకపోవడంతో అత్యవసర రోగులకు సేవలు అందక ఇబ్బందిపడుతున్నారని కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ఆరోపించారు. దీనిపై 108 కో-ఆర్డినేటర్ సురేశ్ బదులిస్తూ అత్యవసర రోగులు కాకుండా చిన్నపాటి సుస్తీచేసినా వాహనం కోసం ఫోన్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దీంతో అత్యవసర రోగులు ఇబ్బంది పడుతున్నారని ... మిగతా 8వ పేజీలో

ప్రజాధనం రాళ్లపాలు



సర్వే రాళ్లపై ఉన్న జగన్ పేరు

గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఫొటోతో సర్వే రాళ్లు

- ఒక్కోరాయికి రూ.300 వరకు ఖర్చు
- రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- కొన్నిగ్రామాల్లో రాళ్లు పాతగా, మరికొన్ని చోట్ల గుట్టలుగా దర్శనం
- కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ పేరు తొలగింపునకు రూ.12 అదనపు ఖర్చు



వృథాగా పడి ఉన్న భూ సర్వే రాళ్లు

చోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): **వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం ఎలా దుర్వినియోగం అయిందో చెప్పడానికి జగనన్న భూరక్ష పథకం కింద రైతుల పొలాల్లో వేయడానికి తెచ్చిన సర్వేరాళ్లు ఉదాహరణగా చెప్పవచ్చు. నాడు రైతుల పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేయించుకోవడంతో పాటు రైతుల పొలాల్లో వేసిన సర్వే రాళ్లపై కూడా వైఎస్ జగన్ పేరు చెక్కించుకోవడంపై రైతాంగంలో తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే.**

రైతుల పొలాల్లో వేయడానికి తెచ్చిన సర్వేరాయి ఒక్కో దానికి రూ.270 నుంచి రూ.300 వరకు ప్రభుత్వం వెచ్చించింది. ఇలా తెచ్చిన సర్వేరాళ్లను కొన్ని గ్రామాల్లో పాతగా, మిగిలిన గ్రామాల్లో ఎక్కడికక్కడ గుట్టలుగా పడేశారు. ఈలోగా ఎన్నికలు రావడం, రైతుల పాసు పుస్తకాలపై జగన్ ఫొటో ముద్రించడం, రైతుల పొలాల్లో సర్వేరాళ్లపై జగన్ పేరుండడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రైతుల్లో పెద్ద ఎత్తున ఆందోళన రేగింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి, పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వ అధికార ముద్రతో ఇస్తామని కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో భరోసా ఇచ్చాయి. హామీ ఇచ్చిన మేరకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చర్యలు చేపట్టింది. వైసీపీ హయాంలో రైతుల పొలాల్లో పాతిన సర్వేరాళ్లపై జగన్ పేరును తొలగించే చర్యలు తీసుకుంది. జగన్ హయాంలో వేసిన రాళ్లకు ఒక్కోదానికి రూ.300 ఖర్చుపెడితే, వాటిపై పేరు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం అదనంగా మరో రూ.12 వరకూ ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

వృథాగా సర్వే రాళ్లు

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గత ప్రభుత్వం కొనుగోలు చేసిన రాళ్లు చాలా వరకు గ్రామాల్లో వృథాగా గుట్టలుగా ఎక్కడికక్కడ పడి ఉన్నాయి. ఈ రాళ్లను కొందరు వంటలకు ఉపయోగించే పొయ్యి రాళ్లుగా, మరికొందరు తమ ఇళ్ల వద్ద మురుగునీటి కాలువల వద్ద బురద లేకుండా వేసి ఉపయోగించుకుంటున్నారు. ఇలా ఎవరికి వారు తమ వ్యక్తిగత అవసరాల కోసం ఈ రాళ్లను వాడుకోగా, మిగిలిన రాళ్లు రోడ్డు పక్కన వృథాగా పడి ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం కోసం వెచ్చించిన ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగం అయిందో చెప్పడానికి ఈ సర్వేరాళ్లే ఓ నిదర్శనంగా గ్రామాల్లో కనిపిస్తున్నాయి.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే పీలా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి, తదితరులు

భారత భూభాగాన్ని ఆక్రమించాలని కుట్ర పన్నిన పాకిస్థాన్‌కు మన దేశ ఆర్మీ కార్గిల్‌లో యుద్ధ భేరి మోగించి పరాక్రమం చాటి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలో పలు చోట్ల కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు.

- వార్త 8వ పేజీలో..



నీలి నీలి ఆకాశం..

మండలంలోని వడ్డాదిలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం వరకు అడపాదడపా చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం ఆరు గంటల తరువాత దట్టంగా మేఘాలు అలుముకుని నీలం వర్ణంలో ఆకాశం ఆహ్లాదంగా కనిపించింది. నక్షత్రాలు మెరుస్తూ మనోహర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ దృశ్యాన్ని సెల్ కెమెరాల్లో బంధించేందుకు పలువురు ఆసక్తి చూపారు.

- బుచ్చెయ్యపేట/ఆంధ్రజ్యోతి

ఎట్టకేలకు లింగాపురం రహదారికి మోక్షం

దశాబ్దాల కాలంగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం

- అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు
- శరవేగంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులు



లింగాపురం వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): **పురపాలక సంఘం పరిధిలోని లింగాపురం గ్రామస్థుల కల ఎట్టకేలకు నెరవేరింది. ఏళ్ల తరబడి వేధిస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం దొరికింది. దీంతో పాటు కంపోస్ట్ యార్డుకు మార్గం సుగమమైంది.**

గిరిజన గ్రామం లింగాపురం 20వ వార్డు పరిధిలోకి వస్తుంది. గ్రామంలో 460 గిరిజనులు నివసిస్తున్నారు. గ్రామస్థులు నర్సీపట్నం రావాలంటే వరహానది దాటుకొని రాకపోకలు సాగించాల్సి వచ్చేది. వర్షా కాలంలో వరహానది ఉధృతంగా ప్రవహించడం వలన ఇక్కడి ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోగులు, గర్భిణులను ఏరియా ఆస్పత్రికి తరలించాలంటే 108 అంబులెన్స్‌లు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదు. దీంతో వారిని డోలీ సహాయంతో నదిలో నడుం లోతు నీళ్లలోంచి అతి కష్టం మీద ఆస్పత్రికి తరలించాల్సి వచ్చేది. విద్యార్థులు ఉన్నత పాఠశాల, కళాశాల చదువులకు వరహానది లోంచి నర్సీపట్నం, బలిఘట్టం రాకపోకలు సాగించేవారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్ఎంలు లింగాపురం నుంచి నర్సీపట్నం రాకపోకలు సాగించడానికి అవస్థలు పడేవారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్అండ్‌బీ శాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు చొరవతో రూ.3 కోట్లతో వరహానదిపై వంతెన నిర్మించారు. దశాబ్దాల కాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం దొరికిందని అందరూ ఆనందించారు. అయితే భూ సేకరణ సమస్య కారణంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం ... మిగతా 8వ పేజీలో

బీఎన్ రోడ్డు కేసు మరో మలుపు

ఆర్అండ్‌బీ సీఈ (ఎన్‌డీబీ), కాంట్రాక్టర్‌కు జిల్లా జడ్జి నోటీసులు

- వచ్చే నెల 23న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశం
- రోడ్డుపై గోతులు పూడుస్తున్నట్టు కోర్టుకు విన్నవించిన ఆర్అండ్‌బీ ఈఈ
- రహదారి దుస్థితికి కాంట్రాక్టర్ అలసత్వమే కారణమని వెల్లడి



కోర్టు వద్ద కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది డేవిడ్

చోడవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): **బీఎన్ రోడ్డు దారుణ పరిస్థితికి సంబంధించి స్థానిక లీగల్‌సెల్ అథారిటీలో న్యాయవాదులు వేసిన కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో ఎన్‌డీబీ నిధులతో రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌తో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను వచ్చే నెల 23న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని 9వ అదనపు జిల్లా జడ్జి, లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ హరినారాయణ శనివారం నోటీసులు జారీ చేశారు.**

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని బీఎన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల గుంతల రోడ్డులో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై స్థానిక న్యాయవాదులు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో, మరో ఇద్దరు న్యాయవాదులు భరత్‌భూషణ్, భూపతిరాజులు ఈ నెల మొదటివారంలో లీగల్‌సెల్ అథారిటీలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్, 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ కలెక్టర్, ఆర్‌డీవోతో పాటు ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఏడుగురు ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ శనివారం కోర్టు ఎదుట హాజరుకావాలని ఈ నెల 7న ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టర్, ప్రభుత్వం తరఫున ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, స్థానిక ఏఈ సత్యప్రసాద్ కోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు. బీఎన్ రోడ్డుతో పాటు మాడుగుల రోడ్డు చాలా ఏళ్లుగా నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్నదని అంగీకరించారు. కోర్టు నోటీసుల నేపథ్యంలో బీఎన్ రోడ్డులో గుంతల మరమ్మతు పనులు ప్రారంభించామని, పెద్ద పెద్ద గోతులు కప్పుతున్నామని, మిగిలిన గోతులు కూడా కప్పే పనులను కొనసాగిస్తామని ఈఈ వివరించారు. అధికారుల స్పందనపై జిల్లా జడ్జి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రోడ్డు మరమ్మతు పనులు కాకుండా, అసలు ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి ఏం చర్యలు తీసుకున్నారని ఆర్అండ్‌బీ ఈఈని ప్రశ్నించారు. దీనిపై ఈఈ సమాధానమిస్తూ బీఎన్ రోడ్డులో అభివృద్ధి పనులు ఎన్‌డీబీ నిధులతో చేపట్టిన కాంట్రాక్టర్ ఎ.యశ్వంత్ వైఫల్యం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని వివరించారు. అయితే ఆ కాంట్రాక్టర్‌తో పనులు చేయించే అధికారం తమకు లేదని, ఎన్‌డీబీ నిధులతో చేపట్టిన పనులు పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్(ఎన్‌డీబీ)కి మాత్రమే ఉందని చెప్పారు. దీనిపై జిల్లా జడ్జి స్పందించి ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్(ఎన్‌డీబీ)తో ... మిగతా 8వ పేజీలో

పెట్టుగోళ్లపల్లి సర్పంచ్

ప్రశాంతికి అరుదైన గౌరవం

- ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనే అవకాశం



పెట్టుగోళ్లపల్లి సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతి (ఫైల్)

ఎస్.రాయవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామ సర్పంచ్ అల్లు వెంకట ప్రశాంతికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందింది. ఈ విషయం శనివారం ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారని ఆమె స్థానిక విలేకరులకు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నందుకు ఆమెకు ఈ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తనకు ఈ ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని, ఇది గ్రామస్థుల సహకారం వల్లే సాధ్యమైందని తెలిపారు. ఈ విషయం తెలిసి ఆమెను గ్రామస్థులు అభినందించారు.

'కూటమి పాలనలోనే రాష్ట్రం సుభిక్షం'



పథకాలకు సంబంధించిన కరపత్రాలతో టీడీపీ నాయకులు

ఎలమంచిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం నేడు అభివృద్ధి పథంలో పయనిస్తుండడంతో పాటు ప్రశాంతంగా ఉందంటే అది కూటమి పాలన వల్లే సాధ్యమవుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ అన్నారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, రవి కుమార్ తదితరులతో కలిసి శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తొమ్మిది, పది వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఎన్నెన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు బొద్దపు శ్రీను, కరణం రవికుమార్, నాయకులు దంట్ల వెంకటస్వామి, కొటారు సూర్య ప్రకాష్, దిగుమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సారథ్యంలోనే ఉత్తరాంధ్రకు గౌరవం : ప్రగడ



ఎలమంచిలి/ అచ్యుతాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే అత్యంత గౌరవం లభించిందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు, నాయకులను ప్రోత్సహించడంలోనూ టీడీపీ ముందుంటుందన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్‌గజపతి రాజుకు గోవా గవర్నర్ పదవి, కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి పదవి, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం కేవలం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యమైందన్నారు. ఇటువంటి నేతలకు ప్రజలంతా ఎల్లవేళలా బాసటగా నిలవాలని ప్రగడ కోరారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ఎలమంచిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

సమష్టిగా ప్లాస్టిక్ నిషేధం

- 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపు
- క్లాప్‌మిత్రలకు రిక్షాల పంపిణీ



క్లాప్‌మిత్రకు రిక్షాను అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. ఇక్కడి మండల కాంప్లెక్స్ ఆవరణలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్కెట్లకు ఖాళీ చేతులతో వెళ్లి, డబ్బులు ఖర్చుచేసి మరీ ప్లాస్టిక్ సంచిలు కొని అందులో వస్తువులు తెస్తుండడాన్ని మానుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎలమంచిలి నియోజకవర్గంలో సుమారు 65వేల గృహాలు ఉన్నాయని, వీరంతా కనీసం రోజుకు రెండు ప్లాస్టిక్ సంచులనైనా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే అనర్థాలను తెలుసుకుని అంతా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటినుంచి మార్కెట్లకు వెళ్లేటప్పుడు ఒక సంచిని తప్పని సరిగా తీసుకు వెళ్లాలన్నారు. దీనిని భారంగా భావించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా చూడాలన్నారు. సమష్టి కృషితోనే ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించగలమని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. అనంతరం కోహెన్స్ లైఫ్‌సైన్స్ కర్మాగారం సమకూర్చిన చెత్త తరలించే రిక్షాలను క్లాప్ మిత్రలకు అందజేశారు. ఈ సంస్థ ఎలమంచిలి నియోజక వర్గంలో గల నాలుగు మండలాలకు 40 రిక్షాలను సమకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, బైలపూడి శ్రీరామదాసు, పైల రామునాయుడుతో పాటు అధికారులు పాల్గొన్నారు.



మోసయ్యపేటలో చెత్త ఊడ్చుతున్న ఎమ్మెల్యే

పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎమ్మెల్యే

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. మోసయ్యపేటలో జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలుచోట్ల కాలువల్లో, రోడ్లపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. అంతకు ముందు అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. కోహెన్స్ లైఫ్‌సైన్స్ కర్మాగారం సమకూర్చిన డస్ట్‌బిన్‌లను షాపుల యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, బైలపూడి శ్రీరామదాసు, పుర్రే శ్రీనివాస యాదవ్, డ్రీమ్స్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అందరి ఆమోదంతోనే పీఏసీఎస్ పదవి కేటాయించాలి'

రాంబిల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని రాంబిల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియమించాలని మండలానికి చెందిన టీడీపీ నేతలు శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును కలిసి కోరారు. అనకాపల్లిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూమండలంలోని దిమిలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జనసేన పార్టీకి, రాంబిల్లిలో పదవిని టీడీపీకి కేటాయించారన్నారు. రాంబిల్లి పరిధిలో ఉన్న 14 పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలను సంప్రదించకుండా కొందరు వారికి అను కూలమైన వారికి పీఏసీఎస్ పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. అం దరి ఆమోదంతో ఈ పదవి కేటాయించాలకోరారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి మాజీ పీ ఏసీఎస్ అధ్యక్షుడు కె.రఘురాజు, నేతలు వి.దినబా బు, కశిరెడ్డి ప్రసాద్, కర్రిసింహాగిరి ప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాల సాధనకు కృషి

నక్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని ఎంఈఓ కె.నరేశ్ తెలిపారు. శనివారం నక్కపల్లిలో నిర్వహించిన హెచ్‌ఎం సమావేశంలో ఇటీవల కొత్తగా హెచ్‌ఎంలుగా విధుల్లో చేరినవారిలో అభ్యసనా సామర్థ్యాలతీరు పరిశీలించారు. అనంతరం నరేశ్‌తో పాటు ఎంఈఓ-2 రుత్తల నాగన్నదొరను హెచ్‌ఎంలు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎంలు బాలాజీ, శ్రీలక్ష్మి, ఎస్. జయశ్రీ, వరలక్ష్మి, పి.విజయ, బషీర్‌ఖాన్, లక్ష్మి, సీఆర్‌పీలు డి.అప్పారావు, దేవి, జ్యోతి, అప్పలనాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న బోధనపై అభినందన

నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్‌పై వినూత్నంగా బోధన చేస్తున్న ఉపాధ్యాయిని కె.సునీతను రవీంద్రనాద్ ఠాగూర్ సంస్థ వ్యవస్థాపకులు, ఆంగ్ల ఉపాధ్యాయులు వైవీ రమణ తదితరులు అభినందించారు. అలాగే, రెడ్ డే వేడుకల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందజేశారు. అంతకు ముందు ఉపాధ్యాయని కె.సునీత ఆంగ్ల సబ్జెక్ట్ బోధన చేస్తున్న సమయంలో విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు, బెలూన్లతో చేసిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు ఎంఎస్ బీ ప్రసాద్, ఎస్.సాంబశివరావు, ప్రసన్న కుమారి, పద్మ, శర్మ, మణికుమార్, రజిని, లైబ్రేరియన్ కె.జనార్దన్ తదితరులతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె ఇంటి పేరుతో తప్పుడు డాక్యుమెంటు ద్వారా రుణం!

మునగపాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తప్పుడు డాక్యుమెంటు కుదవపెట్టి రూ.లక్షల్లో రుణం తీసుకొని అద్దె ఇంటికి ఎసరు పెట్టిన ఉదంతం శనివారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి గ్రామంలో పొలమరశెట్టి అంజనేయులు ఇంటిని అదే గ్రామానికి చెందిన మళ్ల శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులకు అద్దెకు ఇచ్చారు. నెల నెలా అద్దె వసూలు కావడంతో యజమాని కూడా ప్రత్యేక ఆలోచనలు చేయలేదు. ఇదే అదునుగా భావించిన అద్దె ఇంట్లో ఉన్న దంపతుల కుమారుడు బ్యాంకులో పనిచేసే అనుభవం ఉన్న మరో వ్యక్తితో చేతులు కలిపి అద్దె ఇంటిపై రుణం తీసుకునే ఆలోచనలు చేశాడు. మళ్ల భాగ్యలక్ష్మి పేరుతో దొంగ డాక్యుమెంటు సృష్టించి వాటి ద్వారా ఒక ప్రైవేటు బ్యాంకులో రుణానికి సంప్రదించారు. బ్యాంకు వారు సుమారు రూ.తొమ్మిది లక్షల వరకు వారం పది రోజుల క్రితం రుణం ఇచ్చినట్లు తెలుస్తోంది. మళ్లీ ఇటీవల రూ.15లక్షలు రుణం కావాలని మరోమారు సంప్రదించారు. అనుమానం వచ్చినవారు గవర్ల అనకాపల్లి వచ్చి వాకబు చేయగా అసలు విషయం బయట పడింది. రుణం తీసుకున్న వారిది ఇల్లు కాదని తెలియడంతో తీసుకున్న రుణం ఇవ్వాలని ఒత్తిడి చేశారు. సుమారు రూ.నాలుగు లక్షల వరకు రికవరీ అయ్యినట్లు తెలిసింది. అసలు విషయం తెలుసుకున్న ఇంటి యజమాని ఆంజనేయులు రుణం ఇచ్చిన వారికి వివరాలను తెలియజేశారు. ఇంటితో వారికి ఎటువంటి సంబంధం లేదని కేవలం వారు అద్దెకు మాత్రమే ఉంటున్నారని చెప్పారు. ముందు జాగ్రత్తలో భాగంగా ఇంటి యజమాని ఆంజనేయులు శనివారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

అచ్యుతాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని శనివారం అరెస్టు చేశామని సీఐ నమ్మి గణేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాయనమ్మపాలెంలో ఓ బాలిక పట్ల ముస్తఫా అనే వ్యక్తి గురువారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తఫాపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అతనిని శనివారం అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

మహిళల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

- తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు రమాకుమారి



కరపత్రాలతో తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు రమాకుమారి, నేతలు

పాయకరావుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేస్తోందని తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యురాలు మల్లవరపు రమాకుమారి అన్నారు. సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె ఆధ్వర్యంలో నాయకులు స్థానిక దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాదికాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుపై మహిళల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉపాధి కల్పన, ఆర్థి కాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం ఇవ్వడంతోపాటు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథ కాన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గం అభివృద్ధి, పేదల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతలిస్తున్న అర్చకుడు

నక్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకుని మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున కొండపైనున్న స్వామివారి నిజరూపానికి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కిందనున్న ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని పట్టు, పీతాంబరాలతో అలంకరించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

బల్క్‌డ్రగ్‌కు భూములివ్వం

- జానకయ్యపేట గ్రామస్థులు ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జానకయ్యపేట గ్రామస్థులు

నక్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కు కోసం భూములు ఇచ్చేదిలేదని గ్రామస్థులు స్పష్టం చేశారు. శనివారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ మేరకు ఆందోళన చేశారు. వారికి వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, యలమంచిలి తాతబాబు, ఎం.బాబ్జీ, ఎం.కృష్ణ, దేవర సత్తిబాబు, తదితరులు సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుపై చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణ సామాజిక పర్యావరణ నివేదికలో ఈ గ్రామానికి చెందిన 191 ఎకరాల భూములను చేర్చడం చట్ట ఉల్లంఘనేనని అన్నారు. పరిశ్రమల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని చెప్పారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, జనసేన నాయకుడు కురందాసు అప్పలరాజు తదితరులతో కలిసి తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. మామిడి కృష్ణ, చందక నానాజీ, దేవర అప్పలరాజు, దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మునగపాక రైతు సంఘం సర్వసభ్య సమావేశం

మునగపాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఈ నెల 27వ తేదీన మునగపాక గ్రామ రైతు సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు ఎ.వి. మహేశ్, విల్లూరి నర్సింగరావు, దాడి శివ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంకానుందన్నారు. రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలుపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా రైతులందరు విచ్చేయాలని కోరారు.

'పైడమ్మ చెరువును గ్రామ ఆధీనంలోనే ఉంచాలి'



ఎంపీ రమేశ్‌కు వినతిపత్రంను అందజేసిన వాడనర్సాపురం గ్రామస్థులు

రాంబిల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానికుల జీవనాధారమైన పైడమ్మ చెరువును గ్రామాన్ని తరలించేంతవరకు తమ ఆధీనంలోనే ఉండేలా చూడాలని వాడనర్సాపురం గ్రామ సర్పంచ్ కె.రామారావు, గ్రామపెద్దలు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, పార్లమెంట్ కన్వీనర్ వర్మరాజు, ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కారే రాముడు, నేత గిరి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కోరారు. శనివారం అనకాపల్లిలో ఎంపీని కలిసి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకొని ఉన్న పైడమ్మ చెరువు తాతలకాలం నుంచి పంచాయతీ ఆధీనంలో ఉందన్నారు. గ్రామంలోని మత్స్యకార కుటుంబాలు చెరువులో చేపటవేట సాగిస్తూ జీవనంసాగిస్తున్నాయన్నారు. ఈ చెరువుపై ఆధారపడి రైతులు ఆయకట్టు భూముల్లో వ్యవసాయం చేస్తారన్నారు. అయితే, తమ గ్రామాన్ని తరలించేంతవరకు ఎన్ఏటీబీ ప్రాజెక్టు యాజమాన్యం... చెరువు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయకుండా చూడాలని ఎంపీని కోరినట్టు వాడనర్సాపురం, సర్పంచ్, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో మాట్లాడి గ్రామ మత్స్యకారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు వీరు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్. రాయవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపడుతున్నందున ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ తీగ పడి పాడి పశువు మృతి



జానకిరామపురంలో మృతి చెందిన పాడి గేదె

కోటవురట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో విద్యుత్ తీగలు తెగి పడి పాడిపశువు మృతి చెందింది. వివరాలివి.. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు ఆయిల్‌పామ్ తోటలో శనివారం పాడిరైతు కోరుప్రోలు గోవిందుకు చెందిన పశువులు మేతకు వెళ్లాయి. సాయంత్రం విద్యుత్ స్తంభంనుంచి తీగ తెగి పడడంతో ఓ పాడిగేదె అక్కడిక్కడే మృతిచెందింది.

నేటి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ నాయకులు

నక్కపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలోని పలు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమితులైన వారంతా ఆదివారం ఉదయం స్థానికంగా ఉన్న హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి కార్యాలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, నాయకులు లాలం కాశీనాయుడు, చందలపు పద్దు, జానకి శ్రీను తదితరులు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, సెంట్రల్‌బ్యాంకు చైర్మన్ కోన తాతారావు తదితరులు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

గవర్నర్ పదవితో అశోక్ గజపతిరాజుకు సముచిత స్థానం

- గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు

మునగపాక, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్ముకున్న వారికి తెలుగుదేశం పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల ఎకరాలు ప్రజా సంక్షేమం కోసం విరాళంగా ఇచ్చిన అశోక్ గజపతిరాజుపై గత వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి బాధించిందన్నారు. అయినా, అశోక్ గజపతిరాజు బలంగా నిలబడ్డారన్నారు. అప్పట్లో అశోక్‌కు భరోసాగా నిలిచిన చంద్రబాబునాయుడు ఇప్పుడు గోవా గవర్నర్‌గా హోదా కల్పించి ఓ గొప్ప సముచిత స్థానాన్ని కల్పించారన్నారు.ఈ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ పాల్గొన్నారు.

పదవుల కేటాయింపులోఉత్తరాంధ్రకు పెద్దపీట



మాట్లాడుతున్న గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి

కోటవురట్ల: ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమితులు కావడం, ఎంపీ కింజరాపు రామోహ్మన్‌రావు కేంద్రమంత్రిగా, అయ్యన్నపాత్రుడు శాసన సభ స్వీకర్‌పదవి, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీ కావడం తెలుగుదేశంలోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్‌పదవి దక్కడం ఉత్తరాంధ్ర ప్రజలకు గర్వకారణమన్నారు. నీతి నిజాయితీకి నిలువుటద్దంలా ఉన్న ఆయనపై అక్రమకేసులు పెట్టి గత వైసీపీ నేతలు వేధించారన్నారు. ఈ స్థితిలో అశోక్‌కు అధిష్టానం ప్రత్యేక గౌరవం కల్పించడం గొప్పవిషయమన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగు

▸▸ ఏడాది కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు ▸▸ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ రమేశ్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనువాసరావు

లంకెలపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారం చేపట్టాక రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవంతో పాటు శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు. మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణంతో పాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నా మన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ శ్రీనివాస రావులు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటిపడిందన్నారు. కూటమి పాలనలో అన్నిరం గాల్లో ప్రగతి సాధిస్తుందని చెప్పారు. అంతకు ముందు అంతా గ్రామంలో పర్యటించి స్థానిక సమ స్యలను కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మదంశెట్టి నీలబాబు, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి సాలాపు మోహన్‌రావు, స్థానిక నాయకులు తలారి లక్ష్మీప్ర సాద్, ముసిలినాయుడు, వెంకటఅప్పారావు, నాగ రాజు, సుమన్ అప్పారావు, తాతారావు, రామునా యుడు, చినవెంకటరమణ, సత్యనారాయణ, నాగేశ్వర రావు, రాజేశ్, ఈశ్వరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి - చోడవరం రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

తుమ్మపాల : అనకాపల్లి- చోడవరం రోడ్డు నిర్మా ణ పనులను ఎంపీ సీఎం రమేశ్ పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు సమస్య పరిష్కారించేం దుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్టు చెప్పారు. ఈ పనులు పూర్తయితే పలు మండలాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పుతాయన్నారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ ఛైర్మన్ కొట్నీ బాలాజీ, ఉమ్మడి విశాఖజిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీటీసీ విజయ్, అధికారులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కార్యాలయం సందర్శన

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని డీసీఎంఎస్ కార్యా లయాన్ని ఎంపీ సీఎం రమేష్ సందర్శించారు. శిథిలా వస్థలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఈ విష యమై డీసీఎంఎస్ ఛైర్మన్ కొట్నీ బాలాజీ, బీఎం సత్య కుమార్‌లతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అను మతి తీసుకొని ప్రస్తుత కార్యాలయం ఆవరణలో కమ ర్షియల్ కాంప్లెక్స్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తే సంస్థకు లాభదాయకంగా ఉంటుందని ఎంపీ సూచిం చారు. ఆ దిశగా ప్రతిపాదన చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న డీసీఎంఎస్ స్థలాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఎస్‌వీడీఎస్ సేవలు ప్రశంసనీయం : కొణతాల



సంస్థకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొణతాల తదితరులు

తుమ్మపాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : శారదా వేలి డెవలప్‌మెంట్ సమితి (ఎస్‌వీడీఎస్) సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొ న్నారు. శనివారం అనకాపల్లిలో జరిగిన సంస్థ 40వ వార్షికోత్సవంలో ముఖ్య అతి థిగా మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలు, రైతులకు సంస్థ విశేష సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సంస్థకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్క రించారు. నాబార్డు డీడీఎం సుమంత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ సంజయిత, డీసీ సీబీ సీఈవో వర్మ, ఏపీ సీవోబీజీ ఎం.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం'

పరవాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వస తులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. 11వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మించిన అదనపు భవనాన్ని శనివారం ప్రారంభిం చారు. అలాగే, నాబార్డు నిధులతో చేపట్టనున్న వాడచీపురుపల్లి- వెంకటాపురం ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. వాడచీపురుపల్లిలో 30 పడకల ఆస్పత్రి నిర్మా ణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సింహాద్రి ఎన్టీపీసీలో స్థానిక నిర్వాసితులకే ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామని వెల్ల డించారు. సర్పంచ్ శివలంక లక్ష్మి, మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనా యుడు, పైలా జగన్నాథరావు, నాయకులు శిరపురపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, కూండ్రపు శ్రీనివాస్, బొద్దపు శ్రీనివాసకానులు, వియ్యపు చిన్న, పైలా రామచంద్రరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నరసింగరావుపేటలో శని వారం ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కేవీఎల్ గణేష్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.కిరీటిలతో పాటు మరికొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అనంతరం ప్రమాణం చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ వ్యవహ రించారు. ఫెడరేషన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయవాహిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థ లకు అప్పగించరాదంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేప ట్టిన ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో కార్యదర్శి కేఎన్‌వీ రమేష్, కోశాధికారి ఎంటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం'

కశింకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు తక్షణ పరిష్కారానికే మండల సమన్వయ కమిటీ తొలి ప్రాధాన్యం ఇస్తుందని మండల ప్రత్యేకాధికా రిణి వి.లక్ష్మీసుభాషిణి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పలు వురితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వీటికి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.తిరుమలరావు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఆర్‌ఐ రమేష్, ఏఎస్ఐ రమణి పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్కలు నాటండి : కాగ్ ఆడిటర్

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మానవ సంబంధాల పెంపునకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్కలు నాటాలని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సీనియర్ ఆడిటర్ కేఎన్ రాజు పిలుపునిచ్చారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'ఏక్ పెడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల న్నారు. ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ ఎస్.కుసుమావతి, అధ్యాపకులు కేవీఎస్ ప్రభాకర్, వైఎల్ అక్షయ పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

రాబోయే వర్షాలు నాట్లకు కీలకం : ఏడీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రానున్న 15 రోజుల్లో కురిసే వర్షాలు ఖరీఫ్ నాట్లకు కీలకమని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. శనివారం పరిశోధన స్థానంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లా డుతూ జిల్లాలో గత రెండు వారాల్లో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణంలో ఇంతవరకు ఒక శాతం విస్తీర్ణంలోనే వరి వేశార న్నారు. మే, జూన్ నెలల్లో వర్షాలు కురిసినప్పటికీ వరి నాట్లు పూర్తి చేసేందుకు అవసరమైన వర్షాలు జూలైలో కురవలేదన్నారు. మే, జూన్ నెలల్లో కురిసిన వ ర్షాల ఆధారంగా రైతులు వరి విత్తనాలు వేశారని తెలిపారు. గత రెండు నెల ల్లో కురిసిన వర్షాలు వివిధ పంటలకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. సమావే శంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ విశాలక్ష్మి, డాక్టర్ ఉమామ హేశ్వరరావు ప్రసంగించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఘనంగా 'బుద్ద' జన్మదిన వేడుకలు



అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుద్ద జన్మదిన వేడుకల్లో టీడీపీ నేతలు



ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

కొత్తూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు 67వ జన్మదిన వేడుకలు పార్టీ అనకా పల్లి పార్లమెంటు కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సంద ర్భంగా జగదీష్ తనయుడు బుద్ద నూకేష్ కుమారుడు అక్షజ్ జన్మదిన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో టీడీపీ సీనియర్ నాయకులు కొట్నీ రామకృష్ణ, కాండ్రేగుల సత్యనారాయణ, బోడి వెంకట్రావు, షేక్‌బాబర్, మళ్ళ శివన్నారా యణ, మళ్ళ గణేష్, కర్రి మల్లేశ్వరరావు, నడింపల్లి శ్రీనివాసరావు, రేఖా రమణ మూర్తి, పొలమలరశెట్టి సూరిబాబు, దొడ్డి సూరిబాబు, శరగడం నాగేశ్వరరావు, నడిపల్లి గణేష్, పూడి చిన్నారావు, అడారి నారాయణరావు, గోపీకృష్ణ, పెం టకోట రాము, పొలిమేర నాయుడు, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరునామంతో వెంకన్న దర్శనం



కశింకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రం కశింకోటలో ఉన్న వేంకటేశ్వర ధ్యాన మంది రంలో స్వామివారు తిరునా మంతో దర్శనమిచ్చారు. శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేకు వజామున వెంకన్నకు అర్చ కులు చరణ్ విశేష అలంక రణలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

రాజరాజేశ్వరి ఆలయంలో విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

పరవాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని రాంకీ కమర్షియల్ హబ్ కూడలిలో కొలువైన గణపతి, సుబ్రహ్మణ్యం, శ్రీ చక్ర సహిత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం రెండో రోజు శనివారం మరింత ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి విశేష పూజ లతో పాటు చండీహోమం, ఖడ్గమాలా హోమం నిర్వ హించారు. మాడుగుల ఎమ్మెల్యే బం డారు సత్యనారా యణమూర్తి, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీని వాస్, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శిం చుకున్నారు.

బదిలీ అయిన టీచర్ల జీతాలు వెంటనే చెల్లించాలి

▸▸ డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆందోళన



జీతాలు చెల్లించాలంటూ నిరసన తెలియజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బదిలీ పూ ర్తయి రెండు నెలలు గడుస్తున్నా జూన్, జూలై నెలల జీతాలు ఇప్పటికీ రాకపో వడాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం అనకాపల్లి డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయు లకు నూతన స్థానాల్లో పొజిషన్ ఐడీలు రాకపోవడం వలన వారి జీతాల బి ల్లులు డీడీవోలు పెట్టలేని స్థితిలో ఉన్నారన్నారు. జిల్లాలో సుమారు 800 మంది ఉపాధ్యాయులు జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే పొజిషన్ ఐడీలు ఇచ్చి జీతాల బిల్లులు ఈ నెలలోనే పెట్టుకొనే అవకా శం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి సంపద అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు

సబ్బవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాడి అభివృద్ధికి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బీ రామ్మోహన్ రావు అన్నారు. శనివారం ఇక్కడ మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి, చోడవరం, బుచ్చెయ్యపేట, సబ్బవరం, తదితర మండలాల పశు వైద్యా ధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర- విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు గణనీయంగా పెంచేందుకు పశు వైద్యాధికారులు చర్యలు తీసుకొని, తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో మొదటి విడతగా వెలుగు సిబ్బంది ద్వారా ఒకే ఒక్క పాడి పశువు కలిగిన 50 మంది రైతులను గుర్తించామన్నారు. వారికి బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ పథకాల ద్వారా కల్పించిన రుణ సదుపాయంతో ఆగస్టు నెలలో పశువులు కొనుగోలుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఏరియా పశు వైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు, డాక్టర్ గౌతమ్‌వర్మ, డాక్టర్ ఉషాకుమారి, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ, పలు మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇరువాడలో ఆక్రమిత గెడ్డవాగు భూముల పరిశీలన



ఇరువాడలో ఆక్రమణకు గురైన గెడ్డవాగు భూములను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారి ఎస్.గోపాలరాజు

సబ్బవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ఇరువాడ గ్రామంలో ఆక్రమ ణకు గురైన గెడ్డవాగు భూములను శని వారం జిల్లా సర్వే అధికారి ఎస్.గోపాల రాజు పరిశీలిం చారు. గ్రామా నికి చెందిన తెలుగు యువత మండ లాధ్యక్షుడు బలిరెడ్డి అప్పా రావు ఇరువాడ సర్వే నంబర్లు 106, 103 గెడ్డ పోరంబోకు భూములు ఆక్ర మణకు గురై నట్టు సీఎం డ్యాష్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సర్వే అధికారి గోపాలరాజు స్థానిక సర్వే అధికారి లోకేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలరాజు మాట్లాడుతూ సమగ్ర సర్వే పూర్తయిన తరువాత ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బలిరెడ్డి అప్పారావు, జనసేన నాయకులు బలిరెడ్డి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాలయం వద్ద కొత్త ఐరన్ గ్రిల్



అనకాపల్లిటౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యాలయం ఆరంభంలో కాలువపై ఉన్న పాత ఐరన్ గ్రిల్ స్థానంలో కొత్త దానిని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి గ్రిల్ తుప్పుపట్టి ఉండడం, పలు సంద ర్భాల్లో ఆసుపత్రికి వచ్చే రోగులు ఐరన్ గ్రిల్ మధ్య కాలు చిక్కుకుపోయి ఇబ్బం దులు పడేవారు. ఈ సమస్య ఉన్నతాధికా రుల దృష్టికి వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎంఎస్ ఐడీసీ సుమారు రూ.మూడు లక్షలతో దెబ్బతిన్న గ్రిల్ స్థానంలో నూతన గ్రిల్ ఏర్పాటు చేస్తు న్నట్టు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఆళ్ల రామ చంద్రరావు తెలిపారు.

ఐదున్నర కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో గల వాట ర్ ట్యాంక్ వద్ద గంజాయితో నలుగుర్ని అరెస్టు చేసినట్టు సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరా లివి. వాటర్ ట్యాంక్ వద్ద గంజాయిని కొంతమంది వ్యక్తులు ప్యాకె ట్లుగా తయారు చేసి అమ్ముతున్నట్లు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావుకు శనివారం సమాచా రం అందింది. వెంటనే అయన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఈ సందర్భంగా గవరపా లేనికి చెందిన మామిడి యల్లాజీ, బర్మా కాల నీకి చెందిన వడ్డాది వినయ్, ఎలమంచిలి తులసీనగర్‌కు చెందిన దాడి రాము, ఎల మంచిలికి చెందిన అడ్లబోయిన మనోహర్ లను పట్టుకుని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఐదున్నర కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసును ఎస్ఐ ఎ.వెంకటేశ్వర రావు దర్యాప్తు చేస్తున్న సీఐ చెప్పారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పట్ట ణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వర రావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన పాఠశాల స్థలం పరిశీలన

సబ్బవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తవ్వవానిపాలెంలో జడ్పీ హైస్కూల్ స్థలం ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు శనివారం ఎంఈవో-2 రవీంద్రబాబు రెవెన్యూ అధికారులతో కలిసి సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల ప్రకారం సమగ్ర సర్వే జరిపి, హద్దులు నిర్ణయించిన అనంతరం స్థలాన్ని పాఠశాలకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇన్‌చార్జి హెచ్ఎం తోట పద్మావతి, వీఆర్వో పి.జగన్నాథరావు, సర్వేయర్ మౌనీషా పాల్గొన్నారు.

'డాక్టర్ హిమశేఖర్' విద్యార్థుల రక్తదానం

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రింగు రోడ్డులోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో డాక్టర్ హిమశేఖర్ జయంతి సంద ర్భంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విశాఖ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటైన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ కె.జనార్ధన్, ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, డైరెక్టర్ కె.సౌరబ్, కె.రామ్మోహనరావు, ధర్మలింగం తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్' సిబ్బంది సమస్య పరిష్కారం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కొత్తూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కశింకోట ఆర్ఈసీఎస్ పరిధిలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులకు, సిబ్బందికి గత ఆరు నెలల జీత బకాయిల చెల్లింపునకు నిర్ణయం తీసుకోవడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనకాప ల్లి జనసేన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో టీడీపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కర్రి బాబి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, నూకాంబిక ఆలయ ఉత్సవ కమిటీ మాజీ ఛైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), జనసేన పార్టీ నాయకుడు దూలం గోపీ మాట్లాడుతూ గ్రామీణ విద్యుత్ సహకార సంస్థకు లాభాలకు కారణమైన వినియోగదారులకు సేవ చేయాలనే శంకల్పంతో 2009లో అప్పటి మంత్రి, నేటి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ పాలిటెక్నిక్ కళాశాలను స్థాపించారన్నా రు. అప్పటి నుంచి ఆర్ఈ సీఎస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల పిల్లలకు 50శాతం అడ్మిషన్లు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించారన్నారు. ఈ విధంగా 730 మంది విద్యార్థులు, 37 మంది అధ్యాపక, టెక్నికల్ సిబ్బంది, ఏడుగురు ఆఫీసు సిబ్బందితో కళాశాల నడుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించినట్టు చెప్పారు. ఇటువంటి కళాశాలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కనీసం ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే కొణతాల దృష్టికి సిబ్బంది తీసుకు వెళ్లడంతో శుక్రవారం ఆయన ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో అనకాపల్లి కలెక్టరేట్‌లో సమావేశమయ్యారన్నారు.ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో బకాయి పడ్డ ఆరు నెలల జీతాల చెల్లింపునకు ఆమోదం తెలిపారని వివరించారు. అంతేకాకుండా ఇకపై ప్రతి నెలా సిబ్బందికి జీతాలు చెల్లించాలని సూచించారన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొణతాలకు కూటమి నాయకులు, కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల భవనంలో చదువులు ఎన్నాళ్లు?



వట్టివేగిస పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న, సర్పంచ్ హనుమంతరావు, చిన్నారులు

జి.మాడుగుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొలభం పంచాయతీ పరిధి వట్టివేగిసలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల మరమ్మతులు చేపట్టాలని సర్పంచ్ ఐ. హనుమంతరావు కోరారు. శనివారం ఆయన వట్టివేగిసలో సందర్శించి పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. గతంలో పలు మార్లు పాఠశాల సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదన్నారు. శిథిల భవనంలోని పాఠశాలకు చిన్నారులు పంపించేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు చెప్పారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఉన్న పాఠశాల భవనాన్ని మరమ్మతులో, కొత్త భవన నిర్మాణమో చేపట్టడమో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

జెన్‌కో డ్యామ్ అండ్ పవర్‌హౌస్ ఏడీఈ, ఇన్‌చార్జి ఈఈగా నాగశ్రీనివాసరావు



నాగ శ్రీనివాసరావుకు ఆహ్వానం పలుకుతున్న జెన్‌కో ఇంజనీర్లు, సిబ్బంది

సీలేరు, జూలై 26 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలో ఏపీ జెన్‌కో డ్యాం అండ్ పవర్‌హౌస్ (సివిల్) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏడీఈ)గా సీహెచ్ నాగశ్రీనివాసరావు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ (నెడ్‌క్యాప్) నుంచి జెన్‌కోకు డిప్యుటేషన్‌పై ఆయనను ఇక్కడకు బదిలీ చేస్తూ విజయవాడ విద్యుత్ సౌధ జెన్‌కో ఉన్నతాధికార్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే, సివిల్ ఓఅండ్ఎం డివిజన్ వన్ ఈఈ బదిలీపై వెళ్లడంతో ఈఈ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా సీహెచ్ నాగశీనివాసరావు స్వీకరించారు.ఆయనను సివిల్ విభాగం ఇంజ నీర్లు జైపాల్, సురేష్, అనుదీప్, కార్యాలయం సిబ్బంది రమణబాబు, నాగేశ్వరావు, లక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి ఆహ్వానం పలికారు.

'గిరిజనుల హక్కులు పరిరక్షించాలి'



నూతన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డికి పుష్పగుచ్ఛమిస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులను హరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నూతనంగా నియమితులైన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని కోరినట్టు బీజేపీ నాయకులు తెలిపారు. శనివారం రంపచోడవరం వెళ్లిన బీజేపీ నాయకులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు పాడేరు, రంపచోడవరం డివిజన్ పరిధిలో నకిలీ ధ్రువ పత్రాలతో గిరిజనులుగా చలామణీ అవున్నారన్నారు. ఆదివాసీ హక్కులు, రాయితీలను అనుభవిస్తున్నారని తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్, నాయకులు లకే అబ్బాయిదొర పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి సమస్యలు

గూడెంకొత్తవీధి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత సమస్యలను బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవి అన్నారు. శనివారం విశాఖలో ఆయనను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు తాగునీరు, రహదారు అందుబాటులోలేక ఇబ్బంది పడుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపైఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

డస్ట్ బిన్‌లు పంపిణీ

జి.మాడుగుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణులు ఆరోగ్యకరమైన జీవనశైలికి కృషి చేస్తున్నట్టు బొయితిలి పంచాయతీ యూనిటీ ఇన్‌చార్జి కిడారి రమేశ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో మద్దిగరువులో మహిళలకు డస్ట్ బిన్‌లు అందజేశారు. తడిపొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆశ కార్యకర్త పుష్పవతి, అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బడిమెల గ్రామంలో పర్యటిస్తున్న దొన్నుదొర, నాయకులు



చింతలవీధిలో కరపత్రాలతో టూరిజం డైరెక్టర్ రమేష్‌నాయుడు

కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర

డుంబ్రిగుడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజనుల ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. కరపత్రాల ద్వారా ఏడాదిగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. గ్రామంలో సీసీ రోడ్లు లేక, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దొన్నుదొర సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షంలో గొడుగులు వేసుకుంటూ దొన్నుదొర, నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, మాజీ సర్పంచి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, నాయకులు బాలుదొర తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ పాలనలోనే గిరిజనాభివృద్ధి'

పాడేరురూరల్: తెలుగుదేశం పార్టీ పాలనతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర టూరిజం డైరెక్టర్ కిల్లో వెంకటరమేశ్‌నాయుడు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం ఆయన మండలంలోని చింతలవీధి పంచాయతీ కేంద్రంలో నిర్వహించారు. వర్షంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. యువతకు ఇప్పటికే మెగా డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించిందన్నారు. పోలీస్ శాఖలో నియామకాలు, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగినట్టు వివరించారు. నాయకులు కోడా వెంకట సురేశ్ కుమార్, వనుగు సురేంద్ర, కిల్లు శంకర్ నాయుడు, బాషా తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై ఆదివాసీ రైతులకు ప్రోత్సాహం

డీఆర్‌సీ ఏవో ఎల్‌ఆర్‌బీ పాత్రుడు



మాట్లాడుతున్న ఏవో పాత్రుడు

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పంటలు సేంద్రియ పద్ధతిలో పండించేందుకు వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులు ప్రోత్సహించాలని డీఆర్‌సీ ఏవో ఎల్ఆర్‌బీ పాత్రుడు అన్నారు. స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న ప్రకృతి వ్యవసాయం శిక్షణ తరగుతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా డీఆర్‌సీ ఏవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాని ఆర్గానిక్ హబ్‌గా ప్రకటించిందన్నారు. సేంద్రియ సాగుకు జిల్లాలోని గిరిజన ప్రాంతల భూములు అత్యంత అనుకూలమన్నారు. ప్రభుత్వం పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. గిరిజన రైతులు నాట్లు వేసిన నాటి నుంచి పంట కోసే వరకు సాగు పద్ధతులు, ఇతర సహకారం అందించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను రైతులకు గ్రామాల్లో వివరించాలన్నారు. రైతులు వ్యవసాయంలో రసాయనికి ఎరువులు, పురుగు మందులు వినియోగించరాదన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు మాట్లాడుతూ కూరగాయలు, ఉద్యాన, వ్యవసాయ పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే రైతులు సాగు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో మధుసూదనరావు, ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ఎన్‌ఎఫ్ఏ కుమార్, ఎన్‌ఎఫ్ఏ టీఎన్‌సీ బాబాజీ, మెంటర్ రాజుబాబు, చింతపల్లి యూనిట్ ఇన్‌చార్జి కొర్ర మోహన్‌రావు పాల్గొన్నారు.

కించుమండలో పారిశుధ్య పనులు



వీధికాలువలో పూడిక తీత పనులు

డుంబ్రిగుడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమంలో సర్పంచి చెల్లమ్మ ఆధ్వర్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాల ను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సమయం సద్వినియోగంతోనే ఫలితాలు: డీఎస్పీ



అరకు కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ షెహబాజ్ అహ్మద్

అనంతగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథాగా చేయకుండా బాగా చదువుకుని ఆశించిన లక్ష్యాలను సాధించాలని డీఎస్పీ షెహబాజ్ ఆహ్మద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి రవాణా వంటి వాటికి జోలికిపోవద్దని సూచించారు. అరకు సీఐ హిమగిరి, ఎస్ఐ డి. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అరకులోయ: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాడేరు డీఎస్పీ షేక్ షెహబాద్ అహ్మద్ అన్నారు. శనివారం అరకు సీఐ ఎల్. హిమగిరి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, అన్లైన్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. సీఐ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ చలపతిరావుతో కలిసి మొక్కలను నాటారు. డీఎస్పీని అధ్యాపకులు సన్మానించారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



పెదబయలులో పార్కును శుభ్రపరుస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

పెదబయలు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చర్యణ్‌రాజ్ తెలిపారు. సీఆర్‌పీఎఫ్ 87 బెటాలియన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ కొల్లి రమణతో కలసి శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన రహదారి, ఎంపీడీవో కార్యలయం తదితర ప్రాంతాల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్ళే మార్గంలో మొక్కలను నాటారు. కేజీబీవి విద్యాలయంలో విద్యార్థినులకు విద్యా సామగ్రి, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి :యూటీఎఫ్



డీఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాడేరురూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతభత్యాలు చెల్లించాలని, బోధనేతర, ఆన్‌లైన్ పనులను మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం డీఈవో వద్ద ఈ మేరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మే నెలలో బదిలీలు చేపట్టిన ప్రభుత్వం జూలై 26వ తేదీ వచ్చినా, వారికి జీతభత్యాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పి.దేముడు, ఎస్.కన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రాజు, ఎం.శ్రీను, ఎస్.గంగాధర్, ఎస్.బాలకృష్ణ, కె.రాజారావు, టి.సుబ్బారావు, జి.శ్యామ్, ఈశ్వరనాయుడు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు వితరణ



కంచాలు అందజేస్తున్న సీఐ

గూడెంకొత్తవీధి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి పంచాయతీ శివారు వెదురుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక సీఐ వ్యక్తిగత నిధులతో కొనుగోలుచేసిన కంచాలను పంపిణీ చేశారు. శనివారం సీఐ గ్రామాన్ని సందర్శించారు. స్థానిక గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుతో ముచ్చటించారు. విద్యార్థులందిరికీ కంచాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సీఐని సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు నాడెల దారబాబు, చెల్లయమ్మ, మూర్తి పాల్గొన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు

పాడేరురూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కోట్లగరువు గ్రామ సమీపంలో గెడ్డలోకి బోల్తాపడింది.పాడేరులో సిమెంట్ అన్‌లోడ్ చేసి శనివారం ఉదయం 9 గంటల సమయంలో తిరిగివెళ్తుండగామండలంలోని కోట్లగరువు గ్రామ సమీపంలో ఆటో రావడంతో దాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గెడ్డలోకి బోల్తాపడింది.లారీలోఉన్న డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరు స్థానిక జిల్లా ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందారు.

వీడని వర్షం.. జనజీవనానికి అంతరాయం

సీలేరు, జూలై 26 , (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో శనివారం కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ధారకొండ, దుప్పులవాడ , గుమ్మరేవుల పంచాయతీల్లో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ధారకొండ గుమ్మిరేవుల మార్గంలో మాదిమళ్ళ వంతెన, ఆంధ్ర -ఒడిశా సరిహద్దులోని పిల్లిగెడ్డ వంతెనలు బురదమయంగా మారి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.జీకేవీధి సీలేరు ప్రధాన రహదారి సమస్యగా మారింది. అలాగే , మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోజువారీ కూలీలకు పనులు లేక ఇళ్లకే పరిమితమయ్యారు.



బురదమయంగా మారిన ముంచంగిపుట్టు సంత ప్రాంగణం

రోజంతా ముసురే....

అరకులోయ: అరకులోయలో శనివారం రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. శుక్రవారం నుంచి తుఫాన్ ప్రభావంతో వర్షం కురుస్తోంది. జనం రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు గ్రామాల్లో రైతుల వ్యవసాయ పనులకు ఆటంకంగా మారింది.



వర్షాలకు బురదమయంగా జీకేవీధి- సీలేరు ప్రధాన రహదారి

వారపు సంతకు వర్షం దెబ్బ

ముంచంగిపుట్టు: మండల పరిధిలో గత మూడు రోజులుగా వర్షం వీడటంలేదు. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు వచ్చిన అరకొరగా వినియోగదారులు త్వరగతిన వెనుదిరగడంతో వ్యాపార లావాదేవీలు ఆ శించిన స్థాయిలో జరగలేదు. దీం తో వ్యాపారులు తీవ్ర నిరాశ చెందారు. సంత ప్రాంగణం బురద వల్ల అడుగు తీసి వేయలేని పరిస్థితి నెలకొంది. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాలకు తరచూ తీవ్ర అంతరాయం నెలకొంటోంది.

దేవాపురం మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ చిన్నమ్మలు(ఫైల్)

పాడేరురూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల దేవాపురం పంచాయతీ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అల్లంగి చిన్నమ్మలు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దేవాపురం సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేసిన ఆమె పంచాయతీలో రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుకు ఆమె ఎంతగానో కృషి చేశారు. శనివారం గ్రామంలో నిర్వహించిన ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. నాయకులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ముంచంగిపుట్టు, జులై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరి ష్కరించాలని ఎస్ఎఫ్ఐ జి ల్లా కార్యదర్శి కొర్రా కార్తీక్‌శ్రీను డిమాండ్ చేశారు. శనివారం కళాశాలను ఆయన సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా పవన్ చంద్, భాస్కర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాలికల కన్వీనర్‌గా మమిత, కో కన్వీనర్‌గా మల్లేశ్వరి, సభ్యులుగా పలువురిని నియమించారు.

వైభవంగా సత్యనారాయణస్వామి విగ్రహావిష్కరణ



సత్యనారాయణ స్వామి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గిరికైలాస క్షేత్రంగా పేరుగాంచిన పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం అ త్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం స్వామి వారి వ్రతాలు, వివాహాది శుభకార్యాలు చేసుకొనేందుకు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. టి.నరసింగరావు, ఆలయ ధర్మకర్త సింహాచలం నా యుడు, రమాదేవి దంపతులు, అర్చకులు రామం పంతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు స్వామి వారి వ్రతాన్ని చేపట్టారు. భక్తులకు వర్తక సంఘం ప్రతినిధులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు దంపతులతోపాటు, వైఎస్ఎంపీపీ గంగపూజారి శివకుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకట రత్నం, వైదేహి దంపతులు, శివరాత్రి శ్రీనివాస్ కు మార్, కొట్టగుళ్లి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు, వంతినిబ రాజుబాబు, గాయత్రి దంపతులు, కొమ్మోజి వెంకటరమణ, ఆధ్యాత్మిక సేవా బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతపై దేశ సమగ్రత బాధ్యత



మర్రిపాలెంలో కార్గిల్ విజయ్ దివాస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి):దేశ సమగ్రతను కాపాడేలా పారా మిలటరీ దళాలలో యువత చేరాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మంగమ్మ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేం ద్రం , లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, వేమా ఎన్‌జీవో వెల్ఫేర్ సొసైటీ నేతృత్వంలో కార్గిల్ విజయ్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందచేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యు వత దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 1999లో జరిగిన కార్గిల్ యు ద్ధంలో అశువులు బాసిన వీరజవాన్లకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె. రమ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి జగదీష్, కళాశాల సి బ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి



గృహాల నుంచి చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు గిరిజనులు సహకరించాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం ఎంపీడీవో కొమ్మంగి పంచాయతీ కేంద్రంలో జరుగుతున్న పారిశుధ్యం మెరుగు పనులను పరిశీలించారు. గృహాల నుంచి నేరుగా తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందన్నారు. పంచాయతీ సిబ్బంది గృహాల వద్దకు వచ్చి తడి, పొడి చెత్తను సేకరిస్తారన్నారు. గిరిజనులు చెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదన్నారు. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు పారిశుధ్యం పనుల్లో విధిగా పాల్గోవాలన్నారు.

గిరిజనేతరుల అక్రమాలపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



జాతీయ ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రమిస్తున్న గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు

పాడేరురూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో జరుగుతున్న ఆదివాసీ చట్టాలు, హక్కులు ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఢిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ అంతర్ సింగ్ ఆర్య, కమిషన్ గౌరవ సభ్యులు జాతోతు హుస్సేన్‌లను శనివారం కలిసి వినతిపత్రాలందించినట్టు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనేతరుల భూ ఆక్రమణలపై ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని, నకిలీ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరామన్నారు. పాడేరు, అరకులోయతోపాటు వివిధ మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములను బినామీ పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న గిరిజనేతరులపై కేసులు నమోదు చేయాలని కోరినట్టు వారు తెలిపారు. గిరిజనేతరులు ఆక్రమణలకు సహకరించిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలపై తగిన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు, జిల్లా నాయకులు సాగిన కేశవరావు, పాంగి నందో, జె.సింహాచలం, సాంబశివరావు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తున్న ఘనత కూటమిదే: గిడ్డి ఈశ్వరి



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న నియోజక వర్గ ఇన్‌చార్జి ఈశ్వరి

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పగ్గాలు చేపట్టిన తొలి నెలలోనే ఎన్టీఆర్ భరోసా పిం ఛన్లు పెంచిన ఘనత చంద్రబాబు మాత్రమే దక్కుతుందన్నారు. కుటుంబంలోనున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం నగదు అందించారన్నారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆండ్రాబు లక్ష్మణ్, చెన్న కేశ్వవ నాయుడు, గంగరాజు, వెంకటరావు, సొలం కొత్తంనాయుడు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ



వృద్ధులకు రేషన్ అందజేస్తున్న సేల్స్‌మన్, వీఆర్వో

చింతపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాజంగి పంచాయతీ కేంద్రంలో వృద్ధులు, దివ్యాంగుల గృహాల వద్దకు రేషన్ బియ్యం తీసుకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా జీసీసీ డీఎం బుక్కా వెంకటేశ్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు గృహాల వద్దకు రేషన్ తీసుకు వెళ్లి అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలజారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో సేల్స్‌మేన్లు, డీలర్లు రేషన్ డోర్ డెలివరీ చేస్తున్నారని, ఆగస్టు నెల రేషన్ నెలాఖరులో దివ్యాంగులు, వృద్ధులకు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మన్ శెట్టి చిన్నాబ్బాయి, వీఆర్వో వి. మానావతి పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కె.కోటపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. చోడవరం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. చౌడువాడకు చెందిన పుర్రె అప్పలరాజుకు ప్రమాదవశాత్తు రెండు కాళ్లు చచ్చుబడిపోవడంతో, బాధితుడి వద్దకే ఎమ్మెల్యే నేరుగా వెళ్లి చెక్కు అందజేశారు. మాడుగుల మండలంలోని ఎనిమిది మందికి రూ.3.36 లక్షలు, చీడికాడ మండలంలోని ముగ్గురికి రూ.2.48 లక్షలు, దేవరాపల్లి మండలంలోని ఏడుగురికి రూ.4.96 లక్షలు, కె.కోటపాడు మండలంలోని పది మందికి రూ.7.55 లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, నాయకులు జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ, కుంచా అంజిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరచుకున్న పశువైద్య కేంద్రం

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీ శ్రీధర్

నాతవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువైద్య కేంద్రం ఎట్టకేలకు తెరచుకుంది. 'పశువైద్య కేంద్రం తెరవండి మహాప్రభో..' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ శనివారం నాతవరం పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. గుమ్మిడిగొండ, వైడీపేట, సరుగుడు వెటర్నరీ అసిస్టెంట్లు ఒక్కొక్కరు రెండు రోజుల చొప్పున నాతవరం పశువైద్య కేంద్రానికి వచ్చి విధులు నిర్వహించి పాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ సందర్భంగా ఏడీ ఆదేశించారు. అయితే పశువైద్య కేంద్రంలో వైద్యులు, కార్యాలయ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీచేసి ఇబ్బందులు తొలగించాలని పాడి రైతులు కోరుతున్నారు.

తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ బాధ్యతలు



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐలు

చోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జిగా హరినారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా జడ్జిగా పనిచేసిన ఎ.రతన్‌కుమార్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో హరినారాయణ నియమితులయ్యారు. జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన హరినారాయణను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామిరెడ్డి వెంకటరావు, చీపురుపల్లి సూర్యనారాయణ, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా జడ్జిని చోడవరం, కొత్తకోట, పాడేరు సీఐలు బి.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, బి.దీనబంధు మర్యాదపూర్వకంగా కలిశారు.

మాదక ద్రవ్యాల నివారణకు స్పెషల్ డ్రైవ్




కళాశాలలో విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

కృష్ణాదేవిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల పరిసరాలు, విద్యార్థుల బ్యాగులను అధ్యాపకులతో తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తారకేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, అధ్యాపకులు గోవింద్, శ్రీనివాస్, రామకృష్ణ, నాగేశ్వరి పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థుల బ్యాగులను ఎస్ఐ ఎం.రఘువర్మ తనిఖీలు చేశారు. గంజాయి, గుట్కా తదితర నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తీసుకునే జాగ్రత్తల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల సమీప దుకాణాల్లో కూడా మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు. అలాగే పాఠశాల పరిసరాల్లో చక్కర్లు కొడుతున్న ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ప్రాంతంలోమరోసారి కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని వారిని ఎస్ఐ హెచ్చరించారు.

నాలుగేళ్ల తర్వాత ఇంటికి చేరిన తల్లీబిడ్డలు



రూరల్ పోలీసుల సమక్షంలో తల్లీబిడ్డలు

నర్సీపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం అదృశ్యమైన తల్లీ, ఇద్దరు పిల్లలను గాలించి పట్టుకొని పోలీసులు ఇంటికి చేర్చారు. శనివారం రూరల్ సీఐ రేవతమ్మ అందించిన వివరాలిలా ఉన్నాయి. 2021లో మాకవరపాలెం మండలం తాడపాల గ్రామానికి చెందిన గుర్రం వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్టు అత్త గుర్ర లక్ష్మి మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంకటలక్ష్మి భర్త రంగా తాగుడుకి బానిసై పిల్లలను సరిగ్గా పట్టించుకోకపోవడంతో పాటు వివాహేతర సంబంధం అంటగట్టడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మాకవరపాలెం హెడ్ కానిస్టేబుల్ డి.అప్పలరాజు అదృశ్యమైన మహిళ ఏలూరులో రేషన్ దుకాణం వద్ద వేలిముద్ర వేసి బియ్యం తీసుకున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో గుర్తించారు. ఈ విషయాన్ని ఆయన ఏటికొప్పాకలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఏలూరులో ఎవరైనా బంధువులు ఉన్నారా అని వాకబు చేశారు. అదృశ్యమైన వెంకటలక్ష్మి పెద్దమ్మను తీసుకొని పోలీసులు ఏలూరు వెళ్లారు. తల్లీ, పిల్లలను మాకవరపాలెం పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శిథిలావస్థలో పశు సంవర్ధక శాఖ భవనం

- రెండు మండలాల్లోని ఐదు ఆస్పత్రులకు ఇదే ఆధారం
- పెచ్చులు ఊడిపడుతున్న శ్లాబ్.. రికార్డులకు రక్షణ కరువు
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు



కూలిపోయే దశకు చేరిన పశు సంవర్ధక కార్యాలయం... (ఇన్‌సెట్‌లో) పెచ్చులు ఊడిపడుతున్న శ్లాబ్

రావికమతం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాల్లోని ఐదు పశువుల ఆస్పత్రులకు కేంద్రమైన రావికమతం పశు సంవర్ధక శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. రావికమతం, రోలుగుంట మండలాల్లోని తట్టబంద, కొత్తకోట, బుచ్చింపేట, రోలుగుంట, కుసర్లపూడి పశువుల ఆస్పత్రులకు ఇదే కేంద్ర బిందువుగా ఉంటుంది. ఈ కార్యాలయ భవనంలో అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు మరో ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. ఈ కార్యాలయం నుంచే పాడి రైతులకు అవసరమైన సేవలు అందుతాయి. అలాగే గొర్రెలు, మేకలు మందులు నిల్వలు ఇక్కడి నుంచే ఐదు ఆసుపత్రులసరఫరా చేస్తుంటారు.

సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం 2017కు ముందు పశువుల ఆస్పత్రిగా ఉండేది. తరువాత అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంగా స్థాయి పెంచారు. పూర్వపు భవనం కావడంతో ఇది పట్టు తప్పింది. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. మందులు, రికార్డులపై తరచూ పెచ్చులు పడుతుండడంతో సిబ్బంది భయాందోళనలు చెందుతున్నారు. ప్రతి రోజూ బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉండే గది కూడా శ్లాబ్ పెచ్చులూడి పడుతూ ప్రమాదభరితంగా మారింది. అలాగే మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేక మహిళా సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగక ముందే తగిన చర్యలు చేపట్టాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ దివస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారత్ ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాల శాఖ మై భారత్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శనివారం ఉషోదయ విద్యాసంస్థలో కార్గిల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ దొరబాబు, మై భారత్ ప్రతినిధులు వినయ్‌కుమార్, జ్ఞానదీపు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులందరూ మార్చ్‌ఫాస్ట్ చేస్తూ జెండాకు వందనం చేశారు. కొంతమంది విద్యార్థులు భారత్ మాతాజీకి జై.. జైజవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ 1999లో పాకిస్తాన్ శత్రుమూకలపై భారత సైనికుల విజయానికి సంకేతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సొసైటీ బైలా ప్రకారం సభ్యులు నడుచుకోవాలి



1: మత్యకార సభ్యులతో మాట్లాడుతున్న తహశీల్దార్

గొలుగొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మత్యకారుల సొసైటీ కమిటీ ఆమోదం మేరకే సభ్యులు నడుచుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రజా సమస్యల ప్రజావేదిక నిర్వహించారు. రావణాపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదలడంపై ఇరు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదంపై పోలీసులకు అందిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం రావణాపల్లి రిజర్వాయర్‌లో రెండు నెలల క్రితం సొసైటీ చైర్మన్ నక్కా రమణ, డైరెక్టర్లు, సభ్యులు 20 లక్షల చేప పిల్లలు వదలడం జరిగినట్టు చైర్మన్ తెలిపారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ చేప పిల్లలు ఆరు నెలల వరకు రిజర్వాయర్‌లో వదలకూడదని, అప్పటివరకు సభ్యులు వివాదాలకు పోకూడదని చెప్పారు. మత్యకార సొసైటీ ఇరు వర్గాల సభ్యులపై బైండోవర్ కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఇకపై సొసైటీ బైలా ప్రకారం సభ్యులు నడుచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఎంపీడీవో మేరీరోజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత మల్లునాయుడు జన్మదిన వేడుకలు

- చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు బండారు, రాజు హాజరు



మల్లునాయుడు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యేలు బండారు, కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర తెలుగు రైతు మాజీ ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ఎస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు, పైలా ప్రసాదరావు, లక్ష్మీనారాయణ, మూలినాయుడు, చోడవరం, మాడుగుల నియోజక వర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సమగ్రంగా విచారించి న్యాయం చేస్తాం



అధికారులకు వాదనలు వినిపిస్తున్న ఫిర్యాదుదారులు

చీడికాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా విచారణ చేసి అందరికీ న్యాయం చేస్తామని తహశీల్దార్ కిశోర్ లింకన్ హామీ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ప్రజా వేదిక జరిగింది. మండలంలోని బైలుపూడి, చిన గోగాడ, వీరభద్రపేట, గ్రామాల్లో భూ వివాదం సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరు వర్గాల వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదు దారులు చెప్పిన విషయాలను విన్న అధికారులు, ఆధారాలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామారావు, ఆర్ఐ కృష్ణ, వీఆర్వో సలుగు సత్యనారాయణ, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు బాధ్యతలు చేపట్టడం ఉత్తరాంధ్రకే గర్వకారణం



విలేకరులతో మాట్లాడుతున్న మరిడియ్య

నాతవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతిరాజు బాధ్యతలు చేపట్టడం ఉత్తరాంధ్రకే గర్వకారణమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య పేర్కొన్నారు. శనివారం టీడీపీ నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే ఉత్తరాంధ్రకు చెందిన రామ్మోహన్‌నాయుడును కేంద్ర మంత్రిగా, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన అప్పలనాయుడును ఎంపీగా చేసి ఇక్కడి నాయకులను ప్రోత్సహిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అశోక్‌గజపతిరాజును అవమానించిందని గుర్తు చేశారు. నేడు చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర నాయకులకు ఉన్నతమైన పదవులు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇటంశెట్టి సీతారామ్మూర్తి, కమిలి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై రైతులకు అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రాజబాబు

బుచ్చెయ్యపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మునగాకు ప్రోసెస్ యూనిట్ నెలకొల్పుతున్న తరుణంలో అన్ని గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం రాజబాబు సూచించారు. వెలుగు సీసీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునగ పండించడానికి రైతులను గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు. మునగాకు మూడు నెలలకు ఒక్కసారి కట్ చేసి, ప్రొసెసింగ్ యూనిట్‌కు తీసుకువస్తే మార్కెట్ ధర ప్రకారం రైతులకు చెల్లింపు జరుగుతుందని, మంచి ఆదాయం రైతుకు లభిస్తుందని చెప్పారు. గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించి పథకం వివరాలను రైతులకు తెలపాలన్నారు. వీలైనంత మంది రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమమలో సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

రోలుగుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రోలుగుంట మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. రోలుగుంటలో జరిగిన ఈ ఎన్నికలకు పరిశీలకుడిగా రాష్ట్ర కౌన్సిల్ ఆర్‌వీ దొర, ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రామారావు పాల్గొన్నారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పి.రమణ, ప్రధాన కార్యదర్శిగా కె.అశోక్‌సామ్రాట్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్‌వైఎస్ఆర్ శర్మ, ఉపాధ్యక్షులుగా బి.రాము, ఆర్.విశాలక్ష్మి, ఎం.పెంటారావు, రామ్‌ప్రసాద్, ఎంఎస్‌వీ.మహాలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు

రోలుగుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వీవీఎస్ఎన్.రాజు కోరారు. ఈ మేరకు శనివారం అమరావతిలోని గనులు, భూగర్భ విభాగానికి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మండల, జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. యథేచ్ఛగా అక్రమ మైనింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారన్నారు. అలాగే మైనింగ్ వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. అనేక గ్రామాల్లో వీటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు.

కేజే పురం ఎంపీటీసీ సభ్యుడు హఠాన్మరణం



భీశెట్టి శ్రీనివాసరావు

మాడుగుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్పాజగనాథపురం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు శనివారం హఠాన్మరణం చెందారు. కేజే పురం-2 సెగ్మెంట్ నుంచి టీడీపీ మద్దతుతో ఎంపీటీసీ సభ్యుడిగా పోటీ చేసి గెలుపొందారు. పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారు. అయితే ఆయనకు కొన్ని నెలలుగా ఆరోగ్యం బాగోలేనందున విశాఖ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. ఇటీవల గ్రామానికి వచ్చిన ఆయన, స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. ప్రజలతో నిత్యం మమేకమైన శ్రీనివాసరావు మరణ వార్త గ్రామస్థులను కలచివేసింది. ఆయన మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. ఆయన గతంలో కేజే పురం సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ పి.అప్పలరాజు, ఎంపీపీ టి.రాజారాం, టీడీపీ మండల అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.

పీ-4 గ్రామసభల్లో నిరుపేదలను గుర్తించాలి

కృష్ణాదేవిపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీ-4 గ్రామసభల ద్వారా నిరుపేదలను గుర్తించాలని నాగాపురం సర్పంచ్ యలమంచి రఘురామ్ కోరారు. గొలుగొండ మండలంలోని నాగాపురం, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో శనివారం పీ-4 గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని కుటుంబాల వివరాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాలని, తద్వారా నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా అందించే పథకాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డి.సహదేముడు, టీడీపీ నాయకులు ముర్వల బుజ్జి, రమణ, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, ప్రకాశ్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కె.కోటపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల వేతన బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక 30 పడకల ఆసుపత్రి ఆవరణలో శనివారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పీఎఫ్ డబ్బులు కట్టకుండా శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కింద స్థాయి విభాగాల్లో ప్రాణాలను పణంగా పెట్టి కార్మికులు సేవలు అందిస్తున్నారని, వారు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. కాంట్రాక్టర్ల దోపిడీ నుంచి వారికి విముక్తి కలిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, బంటుపల్లి లక్ష్మి, నాగరత్నం, శ్రీలక్ష్మి, రామారావు, పుష్ప, అరుణ, సత్యవతి, ఈశ్వరరావు, సన్యాసమ్మ, చిన్ని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల విద్యపై అవగాహన

రావికమతం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి, మత్స్యవానిపాలెం, కొమిర, మత్స్యపురం, చినపాచిల అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల విద్యపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాజరాజేశ్వరి ఆయా కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆటలు, కథలు, పాటలు, బొమ్మల ద్వారా బాల, బాలికలకు అర్థమయ్యే రీతిలో ప్రాథమిక విద్య బోధించాలని సూచించారు. అలాగే బాల బాలికలకు పోషకాహారం అందించేలా తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలని ఆమె చెప్పారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

చీడికాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో పూర్వ విద్యార్థి మృతి చెందగా, అతని కుటుంబానికి సహచరులు అండగా నిలిచారు. మండలంలోని అర్జునగిరి గ్రామానికి చెందిన గొర్లె సుబ్రహ్మణ్యం గుండెపోటుతో మృతి చెందాడు. తురువోలు పాఠశాలలో 2006-07 బ్యాచ్‌లో సుబ్రహ్మణ్యం పదో తరగతి చదివాడు. అతని మృతి విషయం తెలుసుకున్న ఆ బ్యాచ్‌లోని విద్యార్థులు శనివారం రూ.71 వేల నగదును సుబ్రహ్మణ్యం భార్యకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణారావు పాల్గొన్నారు.

వడ్డాదిలో పారిశుధ్య పనులు

బుచ్చెయ్యపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాదిలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలు పూడికలు తీసి పరిశుభ్రం చేశారు. అలాగే దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. పరిసరాలు, కుండీల్లో నీరు నిల్వ ఉంచకూడదని ఈవోపీఆర్డీ విజయలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రోలుగుంటలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ తెలిపారు. శనివారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య నివారణ పనులను ప్రారంభించారు. కాలువల పూడికతీత, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

180 మందికి నేత్ర వైద్య సేవలు

మాకవరపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూరుగుపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. అలాగే వారికి అవసరమైన మందులను అందించారు. కొంత మందిని ఆపరేషన్లకు ఎంపిక చేయగా, వారందరినీ విశాఖపట్నం తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓబ్బలరెడ్డి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన టీడీపీ నాయకులు

దేవరాపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) ఎస్ఐ వి.సత్యనారాయణ టీడీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరుణాకరరావు, గొర్లె దేముళ్లు, సత్తిబాబు, బాబ్జీ, దేముడమ్మ పాల్గొన్నారు.

వర్గీకరణతో దళితుల ఐక్యతపై కుట్ర

నర్సీపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతకు రాజకీయ కుట్ర జరిగిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.రత్నాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కృష్ణా పేలస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో ఉన్న 108 కులాల మధ్య చిచ్చు పెట్టడానికి వర్గీకరణను తెర మీదకు తెచ్చారన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపుతున్నాయన్నారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పక్కదోవ పట్టించేందుకే వర్గీకరణను తెరమీదకు తెచ్చారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్ వర్గీకరణపై కనీసం నోరు మెదపడం లేదని విమర్శించారు. ఉత్తర భారతదేశంలో రైతుల చట్టాలను వెనక్కి తీసుకునేవరకు ఎలా ఉద్యమించారో, అదే తరహాలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెనక్కి తీసుకునేంత వరకు శాంతియుతం పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రేమ్ కుమార్, కె.కల్యాణ్, టి.నాని, జి.శివ పాల్గొన్నారు.

అమ్మంటే మెరిసే మేఘం.. నాన్నంటే నీలాకాశం..



ప్రేమ, ఆప్యాయతలకు ప్రతిరూపం తల్లిదండ్రులు

- పిల్లల ఎదుగుదలకు, వారి ఉన్నతికి శ్రమించే శ్రామికులు
- వారి త్యాగాలను గుర్తించి, ప్రేమించడం పిల్లల బాధ్యత
- ప్రస్తుత రోజుల్లో ఆ బంధాలు కనుమరుగు

నేడు ప్రపంచ పేరెంట్స్ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం): అమ్మంటే మెరిసే మేఘం, కురిసే వాన... నాన్నంటే నీలాకాశం తలవంచేనా.. అన్నాడో సినీ కవి. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిచ్చిన నుంచి వారు పెరిగి పెద్దయ్యే వరకూ కంటికి రెప్పలా సాకుతారు. వారి ఆనందమే తమ సంతోషంగా... వారి కష్టమే తమ బాధగా.. జీవిస్తారు. పిల్లల ఎదుగుదలకు, వారి ఉన్నతికి నిరంతరం శ్రమిస్తారు. అందుకు ఎన్నో త్యాగాలు చేస్తారు. వ్యక్తిగత జీవితాన్ని కూడా వదులుకుంటారు. కానీ ప్రస్తుత రోజుల్లో కొందరు పిల్లలు తల్లిదండ్రుల కష్టాన్ని, శ్రమను మరుస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న అమ్మ నాన్నలను భారంగా భావిస్తున్నారు. తల్లిదండ్రుల త్యాగాలను, శ్రమను గుర్తించి వారిని గౌరవించడం పిల్లల కనీస బాధ్యత. నేడు ప్రపంచ పేరెం ట్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

తల్లిదండ్రుల దినోత్సవాన్ని గడిచిన కొన్నాళ్లుగా అనేక దేశాల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తొలిసారిగా నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ 1994 జూలై నాలుగో ఆదివారాన్ని అధికారికంగా తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించుకునేందుకు జాతీయ పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. అప్పటి నుంచి అనేక దేశాల్లో పేరెంట్స్ డేను నిర్వహిస్తూ వస్తున్నారు. తమను పెంచేందుకు, ఉన్నత స్థానానికి చేరుకునేందుకు చేసిన కృషిని, త్యాగాన్ని పిల్లలు గుర్తు చేసుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. పేరెంట్స్ డే రోజున పిల్లలంతా తమ తల్లిదండ్రులతో కలిసివుండడం, వారికి ప్రత్యేక బహుమతులిచ్చి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందాన్ని పంచుకోవడం దీని ప్రధాన ఉద్దేశంగా పేర్కొంటున్నారు.

తల్లిదండ్రుల శ్రమను గుర్తించాలి

పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంతగానో శ్రమిస్తుంటారు. జీవితంలో పిల్లలు నిలదొక్కుకునేంత వరకు అండగా ఉండే తల్లిదండ్రులను ఎంతోమంది ఆ తరువాత పట్టించుకోరు. రెక్కలు వచ్చిన పక్షులు మాదిరిగా ఎగిరిపోతూ తల్లిదండ్రులను అనాథలను చేస్తుంటారు. దీంతో ఎంతమంది పిల్లలున్నా ఎవరూ లేని అనాథలుగా జీవిస్తున్న పేరెంట్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు కారణం పిల్లల్లో స్వార్థం పెరిగిపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగం, వ్యాపారం, తన కుటుంబం, స్వేచ్ఛ, ప్రైవసీ.. అంటూ ఎంతోమంది పిల్లలు తమకు అన్ని విధాలుగా అండగా నిలిచిన తల్లిదండ్రులను ఒంటరిగా విడిచిపెడుతున్నారు. ఇంకొంతమంది అనాథాశ్రమాల్లో చేర్పించేస్తున్నారు. పిల్లల్లో నెలకొన్న ఇటువంటి ఆలోచనల్లో మార్పులు రావాలి. ఏడాదికి ఒకసారైనా తల్లిదండ్రులు తమ కోసం చేసే త్యాగాలను పిల్లలకు గుర్తు చేసేందుకే పేరెంట్స్ డేను నిర్వహిస్తున్నారు.

ఆనందంగా ఉండేలా చూడాలి

ఎక్కడ ఉన్నా... ఎలా ఉన్నా... తల్లిదండ్రులను మాత్రం ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పిల్లలదే. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇబ్బందులు పెట్టకూడదనే ఉద్దేశంతో వయసు పైబడినా కూడా సమస్యలను ఎదుర్కోవడం మంచిది. చిన్న వయసు నుంచే పిల్లలకు విలువలతో కూడిన జీవన విధానాలను, కుటుంబ వ్యవస్థలో కీలకంగా వ్యవహరించే తల్లిదండ్రుల గొప్పతనాన్ని తెలియజేయాలి. అలా చేయడం ద్వారా పిల్లలు ఎక్కడ ఉన్నా తుది వరకు తల్లిదండ్రులను ప్రేమిస్తూనే ఉండేలా చేసేందుకు అవకాశం ఉంటుంది. కొందరు పిల్లలు ఆస్తుల కోసం మాత్రమే తల్లిదండ్రుల పట్ల ప్రేమను నటిస్తూ.. ఆ తరువాత వారిని అనాథలుగా చేసే సంఘటనలను కూడా తరచూ చూస్తున్నాం. ఈ తరహా ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులంటే తమకు జీవితాన్ని ఇచ్చిన వాళ్లే కాదు... భవిష్యత్తుకు బాటలు వేసిన దార్శనీకులని అందరూ గుర్తెరగాలి.. వారు జీవితాంతం ఆనందంగా ఉండేలా చూసుకోవాలి.



క్రైం... crime news

ఏడు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిమెట్ల కూడలి నుంచి బుచ్చింపేటకు వెళ్లే రోడ్డులో ఏడు కిలోల గంజాయితో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో ఎస్ఐ రాజారావు, సిబ్బంది బుచ్చింపేట రోడ్డులో వాహనాలు తనిఖీ చేపట్టారన్నారు. చింతపల్లి వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులోంచి దిగిన ముగ్గురు వ్యక్తులు చేతి సంచులతో బుచ్చింపేట వైపు నడుచుకుంటూ వెళుతుండగా పోలీసులు తనిఖీ చేశారన్నారు వారి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయి, ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసిన వారిలో పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం రామిరెడ్డిపురం గ్రామానికి చెందిన రాజనాల కోటిరెడ్డి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పాండురంగాపురం గ్రామానికి చెందిన మహ్మద్ షాముద్దీన్, షేక్ ఇమ్రాన్‌లు ఉన్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైల్వే ట్రాకుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



అరకులోయకు సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అరకులోయ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పట్టణం సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం ఉదయం గమనించారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. చామలచాయ రంగుతో ఉండి, తెలుపు ఫుల్‌హ్యాండ్ షర్టుపైన ముదురు ఆకుపచ్చ ఫుల్‌హాండ్స్ జర్కిన్ వేసుకొని ఉన్నాడు. నలుపు రంగు ప్యాంటు ధరించాడు. బ్రౌన్ కలర్ చెప్పులు వేసుకొని ఉన్నాడు. ఈ సంఘటనపై విజయనగరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ప్రమాద స్థలాన్ని విజయనగరం రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి.అశోక్ పరిశీలించారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089, 6301365605, 0891-2883218కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గిరిజనుడిపై హత్యాయత్నం



తీవ్రంగా గాయపడిన వెంకటరావు

గూడెంకొత్తవీధి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగూడెం చెందిన ఓ గిరిజనుడిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పాత కక్షలతో హత్య చేయడానికి యత్నించారు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన గిరిజనుడుని జీకేవీధి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కి తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యుల అందించిన వివరాలిలా వున్నాయి. కొత్తగూడెం గ్రామానికి చెందిన గడుతూరి వెంకటరావు, మామిడి బాలయ్యల మధ్య రెండేళ్లుగా భూ వివాదాలు జరుగుతున్నాయి. పలు మార్లు భూముల వ్యవహారంలో ఘర్షణలు పడ్డారు. అయితే శనివారం సాయంత్రం వెంకటరావు వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంలో ఆర్‌వీనగర్ వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో బాలయ్య, అతని బావమరిది మల్లుపడాలు మాటువేసి దాడి చేశారు. వెంకటరావు తలపై బాలయ్య, అతని బావమరిది పారతో బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడుని హుటాహుటిని జీకేవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అయితే వెంకటరావు తలకు బలమైన గాయంకావడంతో వైద్యులు కేజీహెచ్‌కి తరలించారు. ఈఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ అప్పలసూరి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రమానందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు జర్మన్ భాషలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు గరిష్ఠంగా 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, అలాగే బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు కనీసం రెండు సంవత్సరాల క్లినికల్ అనుభవం ఉండాలన్నారు. జీఎన్ఎం కోర్సు పూర్తి చేసిన వారు కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ అర్హత ధ్రువీకరణ పత్రాలను స్కాన్ చేసి ఆగస్టు ఏడవ తేదీలోగా ఎస్సీ వెల్ఫేర్ అనకాపల్లి ఎట్‌ది జీ మెయిల్. డాట్ కమ్‌కు పంపాలని, మరిన్ని వివరాలకు 9281438910 నంబరును సంప్రతించవచ్చునని తెలిపారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

- ఎంపీ సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే పీలా హాజరు
- కార్గిల్ అమరవీరులకు నివాళి




నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో పాత బస్టాండ్, కన్యకాపరమేశ్వరి ఆలయం, మెయిన్‌రోడ్డు, ఎన్టీఆర్ జంక్షన్, నెహ్రూచౌక్ వరకు ర్యాలీ సాగింది. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇండియన్ ఆర్మీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచన అని అన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన సైనికులను మనం జీవితాంతం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ సైనికులను ఎంపీ సీఎం రమేశ్, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు, బొడ్డేడ నాగేశ్వరరావు, మారిశెట్టి భాస్కరరావు, టీడీపీ నాయకులు కాయల మురళి, అనకాపల్లి సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పలు కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లోనే రిజిస్టర్డ్ డాక్యుమెంట్

- రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త సర్వీస్ ప్రారంభం
- ఆస్తి కొనుగోలుదారుడి ఫోన్ నంబర్‌కే డాక్యుమెంట్
- ఆ తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఒరిజినల్' అందజేత
- బయోమెట్రిక్ తప్పనిసరి
- ఇంతకుముందులా డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



Dear User,
Please find Below link to downlo
the certified copy of Document
No: 7660/2025, registered at the
VISAKHAPATNAM(R.O) under
Book No: 1.

Thank You! APIGRS 7:19

Download Certificate

Dear User,
Please find Below link to downlo
the certified copy of Document
No: 7660/2025, registered at the
VISAKHAPATNAM(R.O) under
Book No: 1.

Thank You! APIGRS 7:19

ఆస్తి కొనుగోలుదారుడి వాట్సాప్‌నకు వచ్చిన సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగుపరిచేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటోంది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వాట్సాప్ ద్వారానే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటివి అందించే ఏర్పాట్లు చేశారు. సుమారు 300 సేవలు వాట్సాప్‌లోనే అందుతున్నాయి. ఇప్పుడు తాజాగా రిజిస్ట్రేషన్ల శాఖ కూడా ఆ జాబితాలో చేరింది. ఏదైనా ఆస్తిని రిజిస్టర్ చేసినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఒరిజనల్ డాక్యుమెంట్ కాపీని కొనుగోలుదారుడి మొబైల్ నంబరుకు వాట్సాప్‌లో పంపించే ఏర్పాటు చేశారు. విశాఖపట్నంలో జిల్లాలో ఈ సర్వీసు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

ఎలాగంటే...?

ఇప్పటివరకూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ను డాక్యుమెంట్ రైటర్లే సాయంత్రం వేళ తీసుకొని ఆ తరువాత తీరుబడిగా కొన్నవారికి ఇస్తున్నారు. దీని కోసం రిజిస్ట్రేషన్ సమయంలో 'నామినీ' పేరు రాయించేవారు. ఇప్పుడు వాట్సాప్ ద్వారా ఆ డాక్యుమెంట్‌ను వెంటనే పంపడానికి రిజిస్ట్రేషన్ల శాఖ కార్డ్ 2.0. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారుని మొబైల్ నంబరు నమోదు చేయాలని అడుగుతుంది. నమోదు చేశాక దానిని వారి దగ్గరున్న ఆధార్ బేస్డ్ సమాచారంతో నిర్ధారించుకుంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్ డిజిటల్ స్కానింగ్ జరిగిన తరువాత సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా నమోదుచేసిన మొబైల్ నంబరుకు డాక్యుమెంట్ కాపీ వాట్సాప్‌లో వెళ్లిపోతుంది. మొబైల్‌లోనే ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ఆ తరువాత సదరు వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకోవలసి ఉంటుంది. ఇంతకుముందులా వాటిని డాక్యుమెంట్ రైటర్లకు గానీ వేరొకరికి గానీ ఇవ్వరు.

పారదర్శకత పెంచేందుకే...

- బాలకృష్ణ, రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ, విశాఖపట్నం



రిజిస్ట్రేషన్ల శాఖ వ్యవహారాల్లో పారదర్శకత పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనివల్ల ఎవరి డాక్యుమెంట్ వారికే అందుతుంది. వేరొకరు చూసే అవకాశం కూడా ఉండదు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో సరైన మొబైల్ నంబరు ఇవ్వాల్సి ఉంటుంది.

ఎట్టకేలకు లింగాపురం రహదారికి మోక్షం

... 5వ పేజీ తరువాయి

జరగలేదు. దీంతో వంతెన ఉన్నా గ్రామస్థులకు ప్రయోజనం చేకూరలేదు. అలాగే పురపాలక సంఘం పారిశుధ్య విభాగం సిబ్బంది సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్(కంపోస్ట్ యార్డు)కి చెత్తను తరలించడానికి ఇబ్బందులు పడేవారు. చెత్త రవాణా ట్రాక్టర్లు వరహానది లోంచి రాకపోకలు సాగించాల్సి వచ్చేది. టీడీపీ కౌన్సిలర్ రామరాజు అప్రోచ్ రోడ్డు నిర్మాణం గురించి కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు ప్రస్తావించి నిరసన తెలిపేవారు. ఒక పర్యాయం చెప్పుతో చెంపలపై కొట్టుకొని నిరసన తెలపడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

ఈ క్రమంలో గత వైసీపీ ప్రభుత్వం రహదారి నిర్మాణానికి అవసరమైన 15 సెంట్ల భూమిని రూ.10.50 లక్షలతో ప్రైవేటు వ్యక్తి నుంచి కొనుగోలు చేసింది. తాజాగా పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి రూ.27 లక్షలతో 280 మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో దీంతో లింగాపురం గ్రామస్థులకు రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో పాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కి చెత్త తరలించడానికి మార్గం సుగమమైంది.



వరహానదిపై నిర్మించిన వంతెన



వరహానది దాటుతున్న లింగాపురం గ్రామస్థులు(ఫైల్ ఫొటో)

వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన పునీత్

కశింకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ కాలనీలో బాలుడిపై శనివారం సాయంత్రం వీధి కుక్క దాడి చేసింది. ఆ బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిపల్లి పునీత్(6) హౌసింగ్ కాలనీలోని తాతయ్య ద్వారపురెడ్డి బాబూరావు ఇంట్లో ఉంటున్నాడు. కాగా శనివారం సాయంత్రం బయటకు వెళుతుండగా వీధి కుక్క దాడి చేసింది. దీంతో ఆ బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి



మాట్లాడుతున్న కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ

వివరణ ఇచ్చారు. అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనకాలజీ విభాగంలో వైద్యులు కొందరి పనితీరు బాగాలేదని అనకాపల్లి జడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి తెలిపారు. మాకవరపాలెం జడ్పీటీ సభ్యురాలు మాట్లాడుతూ తాళ్లపాలెం నుంచి మాకవరపాలెం వరకు రోడ్డు విస్తరణలో తొలగించిన చెట్లను కొందరు అటవీశాఖ అనుమతి లేకుండా విక్రయించారని ఆరోపించారు. అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు మే నెల నుంచి వేతనాలు అందడం లేదని ఫిర్యాదుచేయగా, దానిపై వివరణ ఇచ్చేందుకు అల్లూరి జిల్లా డ్వామా విభాగం అధికారులు రాకపోవడంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాయడం, చదవడం రావడం లేదని అనంతగిరి, అరకు జడ్పీటీసీ సభ్యులు డి.గంగరాజు, శెట్టి రోష్ని ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో కె. రాజ్‌కుమార్, పలు శాఖల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు కేసు మరో మలుపు

... 5వ పేజీ తరువాయి

పాటు కాంట్రాక్టర్ యశ్వంత్ కూడా వచ్చే నెల 23న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని, వారికి నోటీసులు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు.

పనులు చేపట్టడం ఆనందదాయకం

అనంతరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ మీడియాతో మాట్లాడుతూ చోడవరం, మాడుగుల రహదారి దుస్థితిపై తాము వేసిన కేసుపై ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చివేత పనులు చేపట్టడం ఆనందించదగిన విషయమన్నారు. పెద్ద గోతులు పక్కాగా పూడ్చివేస్తామని అధికారులు ఇచ్చిన హామీని నమ్ముతున్నామని తెలిపారు. ఇదే సమయంలో ఆర్అండ్‌బీ అధికారులకు గోతులు పక్కాగా పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా జడ్జి స్పష్టంగా ఆదేశించారని చెప్పారు. వచ్చే నెల 23న ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్, కాంట్రాక్టర్ ఇచ్చే వివరణ అనంతరం, ఈ రోడ్డు పరిస్థితిపై తమ తదుపరి చర్యలు ఉంటాయన్నారు. అవసరమైతే హైకోర్టును కూడా ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469